సమస్యలు పరిష్కరిస్తాం

మహిళల సమస్యలు పరిష్కరించడానికి కృషిచేస్తానని నాంపల్లి ఎమ్మెల్యే మాజిద్‌హుస్సేన్ అన్నారు. మంగళవారం హుమాయూన్‌నగర్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో పలు డివిజన్ల మహిళలు ఎమ్మెల్యేను కలిసి తమ సమస్యలను విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే అధికారులతో మాట్లాడి.. చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

- మెహిదీపట్నం

మల్లేపల్లిలో అభివృద్ధి పనులు

నాంపల్లి నియోజకవర్గం మల్లేపల్లి డివిజన్‌లో నిర్మిస్తున్న సైడ్‌డ్రైన్, వీడీసీసీ రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం ఎంఐఎం నాయకుడు జాఫర్ ఖాన్, ఏఈ మహేశ్‌తో కలిసి పరిశీలించారు. చికెన్ మార్కెట్, యూసుఫియన్ దర్గా రోడ్డులో రూ. 45 లక్షలతో చేపట్టిన పనులను నాణ్యతతో చేపట్టాలని అధికారులకు సూచించారు.

- మెహిదీపట్నం

రైతాంగ పోరాటానికి సిద్ధం కావాలి

చిక్కడపల్లి, మే 21 : ప్రభుత్వాలు అవంబిస్తున్న రైతాంగ వ్యతిరేక విధానాలతో వ్యవసాయ రంగం సంక్షోభం ఎదుర్కొంటుందని, రైతాంగ సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటానికి సిద్ధం కావాలని రైతు సంఘం సీనియర్ నాయకుడు సారంపల్లి మల్లారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. సాగర్ పిలుపునిచ్చారు. బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ రైతు సంఘం విస్తృత రాష్ట్ర కమిటీ సమావేశం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్ రావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో విత్తనోత్పత్తి రైతులకు ఎలాంటి రక్షణ లేదని, కంపెనీలు రైతులను అనేక విధాలుగా మోసం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రుణ ప్రణాళికను అమలు చేయని బ్యాంకులపై చర్యలు తీసుకోవాలని, రైతులందరికీ రుణాలు ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జూలకంటి రంగారెడ్డి, అరిబండి ప్రసాద్‌రావు, పి.జంగారెడ్డి, చంద్రారెడ్డి, వెంకటేశ్వర్లు, మాదినేని రమేశ్, కందాల ప్రమీల, సత్యనారాయణ, దండ వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న రైతు సంఘం సీనియర్ నాయకుడు సారంపల్లి మల్లారెడ్డి

ఎన్టీఆర్, ఏఎన్ఆర్, కృష్ణ, దాసరి జీవిత సాఫల్య పురస్కారాల ప్రదానం

రవీంద్రభారతి, మే 21 : నందమూరి తారకరామారావు, నాగేశ్వరరావు, హీరో కృష్ణ, దాసరి నారాయణరావులు తెలుగు వెండితెరపై ఒక వెలుగు వెలిగిన మహానటులని, వారి పేరు మీద జీవన సాఫల్య పురస్కారాలు అందజేయడం ఎంతో అభినందనీయమని పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్‌గుప్త అన్నారు.

సీల్‌వెల్ కార్పొరేషన్ – శృతిలయ ఫౌండేషన్, శ్రీభారతి మ్యూజిక్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి వేడుకలను పురస్కరించుకొని ప్రముఖ హాస్య సినీ దర్శకుడు రేలంగి నరసింహారావుకు జీవిత సాఫల్య పురస్కారం, సీల్‌వెల్ సుస్వరాలు కార్యక్రమం మంగళవారం రవీంద్రభారతిలోని ప్రధాన మందిరంలో నిర్వహించారు.

కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కోలేటి దామోదర్‌గుప్త, సీల్‌వెల్ కార్పొరేషన్ సీఎండీ బండారు సుబ్బారావు విచ్చేసి రేలంగి నరసింహారావుకు ఎన్టీఆర్, ఏఎన్ఆర్, కృష్ణ, దాసరి నారాయణరావు జీవిత సాఫల్య పురస్కారాన్ని బహూకరించారు. ఈ సందర్భంగా కోలేటి దామోదర్‌గుప్త మాట్లాడుతూ.. సినీరంగానికి వారు చేసిన సేవలు చిరస్మరణీమన్నారు. ఈ సందర్భంగా బండారు సుబ్బారావు, గాయని ఆమనికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మహ్మద్ రఫీ, కుసుమ భోగరాజు, వ్యాఖ్యాత గాంధీ, తుల సీరామ్ పాల్గొన్నారు. సభకు ముందు నవ రస గాయని ఆలపించిన సీల్‌వెల్ సినీ సుస్వరాలు వీక్షకులను అలరించాయి.

దర్శకుడు రేలంగి నరసింహారావును జీవిత సాఫల్య పురస్కారంతో సత్కరిస్తున్న కోలేటి దామోదర్‌గుప్త, బండారు సుబ్బారావు

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ముషీరాబాద్, మే 21: ఆజామాబాద్ డివిజన్ 11కేవీ బర్కత్‌పుర, మూన్‌కేఫ్, విద్యానగర్, డీడీహెచ్ ఫీడర్ల పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా నేడు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆజామాబాద్ డివిజన్ ఏడీఈ ఎం.విజయభాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఉదయం 11 నుంచి 12 : 30 గంటల వరకు..

బర్కత్‌పుర ఫీడర్ పరిధిలోని బర్కత్‌పుర, పద్మకాలనీ, శంకర్‌మఠ్ కూరగాయల మార్కెట్ పరిసరాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తారు.

మధ్యాహ్నం 12:30 నుంచి 2 గంటల వరకు..

మూన్‌కేఫ్ ఫీడర్ పరిధిలోని శ్రీరామ్‌నగర్, అచ్చయ్యనగర్, మూన్‌కేఫ్, హెరిటేజ్ ప్రెష్, బృందావన్ కాలనీ పరిసర ప్రాంతాల్లో కరెంటు సరఫరా ఉండదు.

మధ్యాహ్నం 2 : 30 నుంచి 4 గంటల వరకు..

విద్యానగర్ ఫీడర్ పరిధిలోని విద్యానగర్, అచ్చుత్‌రెడ్డి మార్గ్ బ్లడ్ బ్యాంక్, వడ్డెరబస్తీ, ఎస్ఆర్‌టీ క్వార్టర్స్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదు.

సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు..

డీడీహెచ్ ఫీడర్ పరిధిలోని వీఎస్‌టీ మొయిన్‌రోడ్, డీడీహెచ్ విజ్ఞాన్‌పురి కాలనీ, దయానంద్‌నగర్, ఎస్ఆర్‌టీ క్వార్టర్స్ పరిసర పాంతాల్లో కరెంటు సరఫరా ఉండదు.

మెహిదీపట్నం, మే 21 : విద్యుత్ లైన్లలో మరమ్మతుల కారణంగా ఆసిఫ్‌నగర్ విద్యుత్ సబ్ డివిజన్ పరిధిలోని 11కేవీ అల్లూరి సీతారామరాజునగర్ ఫీడర్, 11 కేవీ సాయిగార్డెన్ ఫీడర్, 11 కేవీ అరవింద్‌నగర్ ఫీడర్, 11 కేవీ దర్గా కేబుల్ ఫీడర్‌లలో బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు మెహిదీపట్నం సీబీడీ ఏడీ ఓ ప్రకటనలో తెలిపారు.

ఉదయం 11 నుంచి
మధ్యాహ్నం 12:30 గంటల వరకు..

బాలాజీనగర్, సత్యనారాయణనగర్, క్రిస్టల్ గార్డెన్, గుడిమల్కాపూర్, హీరానగర్, సాయినగర్, పవన్ గార్డెన్, కేఆర్‌కేఎం గార్డెన్, శివబాగ్, మహేశ్‌నగర్, రూఫ్ గార్డెన్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదు.

మధ్యాహ్నం 12:30 నుంచి 2 గంటల వరకు..

సంతోష్‌నగర్, ఎస్‌బీఐ కాలనీ, అంబా గార్డెన్, గుడిమల్కాపూర్, క్రాంతినగర్, జీవన్ కల్యాణ్‌నగర్, హిల్ కాలనీ, విజయ్‌సాయి అపార్ట్‌మెంట్, హుడా కాలనీ, సాయిగార్డెన్స్, దేవరత్న, విజయ్ సుశీల్ అపార్టుమెంట్స్, గణేశ్ రెసిడెన్సీ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తారు.

మధ్యాహ్నం 2:30 నుంచి
సాయంత్రం 4 గంటల వరకు..

అరవింద్‌నగర్, సమతా కాలనీ, అజీజ్ బాగ్, రాహుల్ కాలనీ, రెయిన్‌బో అపార్టుమెంట్ ప్రాంతాలు

సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు..

గుల్షన్ కాలనీ, షేక్‌పేట్ నాలా, నారాయణ ఇంజినీరింగ్ కాలేజీ, లక్ష్మణ్ నగర్, దర్గా మొత్తం ఏరియా, వినాయకనగర్ ప్రాంతాలలో విద్యుత్ ఉండదు.

విశ్వకర్మల సంక్షేమానికి కృషిచేయాలి

కాచిగూడ, మే 21: విశ్వకర్మల్లో ఉన్న ఐదు కులాలు వృత్తి ఆధారిత జీవనంలో ఉన్నారని, ప్రపంచీకరణ ఆధునికత వల్ల కులవృత్తుల మనుగడ అసాధ్యంగా మారిందని అంబర్‌పేట నియోజకవర్గం విశ్వకర్మ సంఘం సీనియర్ నాయకుడు పడకంటి అంజయ్యచారి అన్నారు. కులవృత్తులపై ఆధారపడి జీవిస్తున్న పంచ వృత్తులవారి జీవనం మెరుగుకోసం ప్రభుత్వం అన్ని విధాలుగా కృషి చేయాలని ఆయన కోరారు. ఇతర కులాలకు ఇచ్చే రాయితీలు విశ్వకర్మలకు కల్పించాలని సీఎం రేవంత్‌రెడ్డికి ఆయన విజ్ఞప్తి చేశారు.

పనుల పరిశీలన

మెహిదీపట్నం డివిజన్ గుడిమల్కాపూర్ భోజగుట్టలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను పూర్తి చేయాలని నాంపల్లి ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్ ఆదేశించడంతో మంగళవారం జీహెచ్ఎంసీ అధికారులు భోజగుట్టలో పర్యటించారు. ఎంఐఎం నాయకుడు ఇబ్రహీం, ఏఈ విష్ణువర్ధన్ రెడ్డితో కలిసి పెండింగ్‌లో ఉన్న పనులను పరిశీలించారు. పనులను త్వరగా పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటామని ఏఈ తెలిపారు.

- మెహిదీపట్నం

రాష్ట్ర విద్యార్థులు రాణించడం అభినందనీయం

సుల్తాన్‌బజార్ : ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ(ఐటీఐ)లలో శిక్షణ పొందుతున్న విద్యార్థులకు నైపుణ్య శిక్షణతో పాటు స్కిల్స్‌లో కూడా రాణించడం అభినందనీయమని కార్మిక, ఉపాధి శిక్షణ శాఖ ముఖ్య కార్యదర్శి రాణికుముదిని అన్నారు. ఈ మేరకు మంగళవారం మల్లేపల్లి ఐటీఐ క్యాంపస్ ఆవరణలోని తెలంగాణ ఉపాధి శిక్షణ శాఖ ప్రధాన కార్యాలయం ఆవరణలో ఇటీవల జాతీయ స్థాయిలో జరిగిన జాతీయ స్కిల్స్ కాంపిటీషన్-2024 పోటీలలో విజేతలుగా నిలిచిన రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వివిధ ఐటీఐల విద్యార్థులను ఆమె సత్కరించి ప్రత్యేకంగా అభినందించారు. సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఐటీఐలకు పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు తమ వంతు కృషి చేస్తానని అన్నారు. ఐటీఐ విద్యార్థులు స్కిల్స్ పోటీలలో రాణించడం శుభ పరిణామమని అన్నారు. అనంతరం మల్లేపల్లి మోడల్ ఐటీఐని ఆమె సందర్శించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉపాధి శిక్షణ శాఖ జాయింట్ డైరెక్టర్ ఎస్‌వీకే నగేశ్, డీడీ ఎస్ రాజా, ఆర్‌డీడీ ప్యారం నర్సయ్య, మల్లేపల్లి ఐటీఐ ప్రిన్సిపాల్ పుప్పాల జ్యోతిరాణి పాల్గొన్నారు.

మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ విగ్రహానికి రాష్ట్ర కురుమ యువత అధ్యక్షుడు తూమ్‌కుంట అరుణ్‌కుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బొమ్మరాజు క్రిష్ణమూర్తి, నర్సింగ్, శ్రీనివాస్, ధన్‌రాజ్ యాదవ్, ఆదర్శ్, శివాజీ పాల్గొన్నారు.

- అబిడ్స్

రాజీవ్‌గాంధీ వర్ధంతి

అంబర్‌పేట/ కాచిగూడ, మే 21: మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతిని తిలక్‌నగర్‌లో నిర్వహించారు. పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర మాజీ వైర్మన్ జీబీ శ్యాంరావు, సీనియర్ నాయకులు హరినాథ్‌రెడ్డి, అజయ్‌కుమార్, సీహెచ్ మురళి తదితరులు రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

మాజీ ప్లోర్‌లీడర్ దిడ్డి రాంబాబు ఆధ్వర్యంలో బర్కత్‌పుర కార్యాలయంలో రాజీవ్ గాంధీ విగ్రహానికి నివాళులర్పించారు. అశ్లేశ్, బాల్‌రాజు, బాబు, ఓంప్రకాశ్, మల్లేశ్, దీపక్, వేణుగోపాల్ పాల్గొన్నారు.

అశోక్‌నగర్ చౌరస్తాలో కాంగ్రెస్ గాంధీనగర్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం మాజీప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా పండ్లు పంపిణీ చేశారు. పార్టీ డివిజన్ అధ్యక్షుడు అభిషేక్ కెన్నెడీ, వీడీ కృష్ణ, సత్యనారాయణ, జయేందర్ బాబు, మధుమతి, నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

- చిక్కడపల్లి

25న సైకాలజిస్టుల శిక్షణ శిబిరం

చిక్కడపల్లి,మే 21: సైకాలజిస్టుల నైపుణ్యం పెంపొందించేందుకు సైకియాట్రిస్ట్ డాక్టర్ రవ్వ హరికుమార్‌తో ఆందోళన నిర్మూలన మార్గాలపై ఒక రోజు జాతీయస్థాయి శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు ప్రొగ్రెసివ్ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ ఇండియా అధ్యక్షురాలు డాక్టర్ హిప్పో పద్మ, డాక్టర్ వి.జె. క్వార్లిన్ తెలిపారు. అశోక్‌నగర్‌లోని డాక్టర్ హిప్పో కమలాకర్స్ మైండ్ అండ్ పర్సనాలిటీ కేర్‌లో వారు మాట్లాడుతూ.. శనివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అశోక్‌నగర్‌లో కార్యక్రమం ఉంటుందని తెలిపారు. సైకాలజిస్టులు, సైకాలజీ విద్యార్థులు పాల్గొనవచ్చని, 9390044031లో సంప్ర దించాలని సూచించారు.

ఎస్సీ వర్గీకరణతోనే మాదిగలకు న్యాయం

కాచిగూడ, మే 21 : ఎస్సీ వర్గీకరణతోనే మాదిగలకు న్యాయం జరుగుతుందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎడవెల్లి యాదయ్యమాదిగ అన్నారు. మంగళవారం బర్కత్‌పురలో ఆయన మాట్లాడుతూ.. మాదిగ విద్యార్థులు కేంద్ర ప్రభుత్వంపై ఉద్యమానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. మాదిగలు అభివృద్ధి చెందాలంటే జనాభా ప్రాతిపదికన ఎస్సీ రిజర్వేషన్లను ఏ,బీ,సీ,డీలుగా వెంటనే వర్గీకరించాలన్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లుతున్నాడన్నారు.

పాన్‌షాపు నిర్వాహకుడికి 5 రోజుల జైలుశిక్ష

మెహిదీపట్నం, మే 21: రాత్రి వేళలో పాన్‌షాపు నిర్వహిస్తున్న ఓ వ్యక్తికి న్యాయస్థానం జైలుశిక్ష విధించింది. ఆసిఫ్‌నగర్ ఇన్‌స్పెక్టర్ జి. వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. పాన్ అడ్డా పేరుతో మజహర్‌పాషా పాన్‌షాపు నిర్వహిస్తున్నాడు. నిబంధలను అతిక్రమించి రాత్రి సమయాల్లో షాపు తెరచి వ్యాపారం చేస్తున్నాడు. అతడిపై పోలీసులు కేసు నమోదు చేసి మంగళవారం ఉదయం కోర్టులో హాజరుపరిచారు. పూర్వాపరాలను పరిశీలించిన జడి అతడికి 5 రోజుల జైలు శిక్ష విధించినట్లు తెలిపారు.

వైద్యసిబ్బంది సమయపాలన పాటించాలి

ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన డీఎంహెచ్‌ఓ

ముషీరాబాద్ ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటి

ముషీరాబాద్, మే 21: ముషీరాబాద్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం జిల్లా వైద్యాధికారి డాక్టర్ జె. వెంకటి ఆకస్మిక తనిఖీ చేశారు. ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది హాజరు, వైద్య సేవలు అందిస్తున్న తీరును పరిశీలించిన ఆయన వసతులు, రికార్డుల నమోదు తీరును తనిఖీ చేశారు. చిన్నారులకు టీకాలు, గర్భిణులకు అందిస్తున్న సేవలను ఆరాతీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వైద్య సిబ్బంది విధిగా సమయపాలన పాటించాలని, నిర్లక్ష్యంవహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రానున్న వర్షాకాలం నేపథ్యంలో వైద్య సేవల విస్తరణ, సీజనల్ వ్యాధులను అరికట్టడానికి ప్రత్యేక చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఇందుకోసం ఇప్పటి నుంచే అధికారులు, సిబ్బందిని అప్రమత్తం చేశామని, అవసరమైన మందులు అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుతున్న మెరుగైన వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీడీ ప్రొగ్రాం ఆఫీసర్ డాక్టర్ అశ్రిత, ముషీరాబాద్ పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ దీప్తిప్రియాంక, పీహెచ్ఎన్ భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అన్నమాచార్య జయంతి వేడుకలు



లయన్ కేవీ రమణారావును సత్కరిస్తున్న అశోక్‌కుమార్

రవీంద్రభారతి, మే 21: తిరుపతి మహతి కళాక్షేత్రంలో మంగళవారం పదకవితా పితామహుడు శ్రీ అన్నమాచార్య 616వ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నమయ్య సంగీత నృత్యోత్సవం పేరిట నిర్వహించిన సంగీత కార్యక్రమాల్లో వివిధ రాష్ట్రాల నుంచి కళాకారులు పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా టీటీడీ పాలక మండలి మాజీ సభ్యుడు పోకల అశోక్‌కుమార్, అతిథిగా తాళ్లపాక అన్నమాచార్య14వ తరం వంశీయులు శ్రీ హరినారాయణాచార్యులు విచ్చేశారు. సాంస్కృతిక సేవా సంస్థల అధ్యక్షుడు, జర్నలిస్టు లయన్ కేవీ రమణారావును పోకల అశోక్‌కుమార్, మునిరత్నం, గురువులు సత్కరించారు. కార్యక్రమంలో సాలెం శ్రీవిద్య, యామిని, జక్కిడి ప్రసన్నారెడ్డి, మంజుల, పద్మజ, లక్ష్మీప్రవీణా, సిందిరి ఆశా, సునీతాదేవి పాల్గొన్నారు.

రేపు అన్నమాచార్య జయంతి ఉత్సవాలు

రవీంద్రభారతి, మే 21: శ్రీరామ సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వంలో 23న సాయంత్రం 5 గంటలకు రవీంద్రభారతిలోని ప్రధాన మందిరంలో అన్నమాచార్యుల 616వ జయంతి మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు శ్రీరామ సాంస్కృతిక సేవా సంస్థ నిర్వాహకుడు వెంకట్ గరికపాటి ఒక ప్రకటనలో తెలిపారు. వెంకట్ గరికపాటి రచించిన అన్నమాచార్యుల గ్రంథాలను అతిథులు ఆవిష్కరిస్తారని ఆయన పేర్కొన్నారు. అన్నమాచార్య సంకీర్తనలు, తాళ్లపాక పెదతిరుమలాచార్యుల వారి సంకీర్తనలకు వ్యాఖ్యానం, శ్రీరామాంజనేయ రమ్యగీతిక అనే కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డాక్టర్ కె.వి. రమణాచారి(ఐఎఎస్), ప్రముఖ సాహితీవేత్త సుధామ, ప్రకాశ్‌చంద్ర బరోడ్, మామిడి హరికృష్ణ, తనికెళ్ల భరణి పాల్గొననున్నట్లు తెలిపారు.

అలరించిన సినీసంగీత విభావరి

శౌర్య మ్యూజిక్ అండ్ ఎంటర్టైన్మెంట్ సంస్థ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని కల్చరల్ సెంటర్‌లో నిర్వహించిన సినీ సంగీత విభావరి పలువురినీ అలరించింది. గాయకులు ఇందు, దివ్య, ప్రతిభ, వినయ్, హరి, శోభన్‌బాబు, శ్రీనివాస్‌రెడ్డి, శరత్ ఆలపించిన మధుర గీతాలు రంజింప చేశాయి. ఈ సందర్భంగా సంస్థ నిర్వాహకులు స్నేహ హసంతి, గాయనీగాయకులు రమ్య, యోగిత, గోవార్యన్ నాగేందర్‌రావులను సత్కరించారు.

- ముషీరాబాద్

కట్నం తీసుకోకుండా వివాహం చేసుకోవాలి

కాచిగూడ, మే 21: యువకులు వరకట్నం తీసుకోకుండా వివాహం చేసుకోవాలని విశ్వకర్మ మ్యాట్రిమోని వ్యవస్థాపకుడు యర్రోజు రాజరాజేశ్వరి నరసింహచారి పిలుపునిచ్చారు. మంగళవారం కాచిగూడలో ఆయన మాట్లాడుతూ.. విశ్వకర్మ మ్యాట్రిమోని ఆధ్వర్యంలో జూన్ 9న ఆదివారం ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పుల్లేటికుర్తి కల్యాణ మండపం, చిట్టినగర్, విజయవాడలో ఉచిత వివాహ పరిచయ వేదికను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వేదికలో యువతీయువకులు పాల్గొని వివాహ సంబంధాలు కుదుర్చుకోవాలని ఆయన సూచించారు. ఇతర వివరాలకు 7382252782, 9110766408లో సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

చెట్టుపైకి ఎక్కిన వ్యక్తి..

కాపాడిన అగ్నిమాపక శాఖ అధికారులు

వ్యక్తిగత సమస్యలతో చెట్టుపైకి ఎక్కిన 42 ఏండ్ల వ్యక్తిని గౌలిగూడ అగ్నిమాపక శాఖ అధికారులు కాపాడారు. మంగళవారం అస్సాం రాష్ట్రానికి చెందిన నవీన్ కోరి బ్యాంక్ స్ట్రీట్‌లోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఎదురుగా ఉన్న చెట్టుపైకి ఎక్కాడన్న సమాచారం మేరకు గౌలిగూడ అగ్నిమాపక శాఖ అధికారి ఎన్. ప్రవీణ్‌కుమార్ నేతృత్వంలో ఆ వ్యక్తిని చెట్టుపై నుంచి సురక్షితంగా కిందికి తీసుకువచ్చినట్లు తెలిపారు.

- సుల్తాన్‌బజార్

డ్రైనేజీ పనుల పరిశీలన

విజయ్‌నగర్ కాలనీ ఆసిఫ్‌నగర్ ప్రధాన రోడ్డులో జరుగుతున్న డ్రైనేజీ పనులను మంగళవారం ఎంఐఎం నాయకుడు షేక్‌ఖాసీం పరిశీలించారు. నాంపల్లి ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్ ఆదేశాలతో జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి ఆయన డ్రైనేజీ నిర్మాణ పనులను పరిశీలించి పనులను వేగంగా పూర్తి చేయాలని అన్నారు.

- మెహిదీపట్నం

షాపింగ్ మాల్‌లో అగ్నిప్రమాదం

అంబర్‌పేట, మే 21: అంబర్‌పేట ఫ్లైఓవర్ సమీపంలోని ఓ షాపింగ్ మాల్‌లో మంగళవారం అగ్నిప్రమాదం సంభవించింది. మాల్ మొదటి అంతస్తులో ఉన్న ఓ దుకాణంలో ఏసీ కంప్రెసర్ పేలడంతో మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. ఆస్తినష్టం వివరాలు తెలియాల్సి ఉన్నది.